# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
2. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నారు.
3. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రనాయుడు తెలిపారు.
4. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా అర్హులైన వారికి ఇళ్లను అందిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.
5. విజయనగరం జిల్లాలోని గుర్లలో అతిసారం ప్రబలిన ప్రాంతాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈ రోజు పర్యటించారు.

===========================

దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిన ప్రపంచ శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి ఈ రోజు ప్రసంగిస్తూ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి భారత్ కృషి చేస్తోందని అన్నారు. ప్రపంచం ఏఐని కృత్రిమ మేధస్సుగా గుర్తిస్తుంటే, భారతదేశం రెండవ ఏఐ–ఆస్పిరేషనల్ ఇండియాగా మారిందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరంజనేయస్వామి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి, శ్రీకాకుళంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు పాల్గొని పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అలాగే తిరుపతి, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం మన్యం, ఏలూరు, ఎన్టీఆర్, కడప జిల్లాల్లో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొని విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు.

---------------------------

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థలో మార్పులు చేపడుతున్నామన్నారు. పోలీసు వ్యవస్థకు ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్ (35 సెకన్లు)

---

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన నేర చట్టాలు దేశంలో నేరాల కట్టడికి దోహదపడుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు దేశం ఎప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు. జవాన్ల కృషి వల్ల జమ్ము కాశ్మీర్, ఈశాన్య, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొందని తెలిపారు. గత ఏడాది కాలంలో 36 వేల 468 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేశారని అమిత్ షా పేర్కొన్నారు.

---

ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా అర్హులైన వారికి ఇళ్లను అందిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమంపై ఈరోజు నిర్వహించిన ప్రాంతీయ స్థాయి కార్యశాలలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా 100 శాతం లక్ష్యాలను పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (25 సెకన్లు )

---

విజయనగరం జిల్లాలోని గుర్లలో ఇటీవల అతిసారం ప్రబలిన ప్రాంతాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు పర్యటించారు. పర్యటనలో భాగంగా ఎస్ఎస్ఆర్‌పేటలో పంపు హౌస్ వద్ద, నీటి నాణ్యతను పరిశీలించారు. అతిసార బాధితులను పవన్ కల్యాణ్ పరామర్శించి వారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

---

విజయవాడలో రేపటి నుండి రెండు రోజులపాటు జరిగే అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 కు సంబంధించి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో ఐదు ప్రాంతాల్లో భారీ డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి ప్రజలు ఈ ప్రదర్శనను తిలకించేలా ఏర్పాట్లు చేశామని డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్ తెలిపారు. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి కె. నవీన్ కుమార్ అందజేస్తారు.

వాయిస్ ( 29 సెకన్లు)

-------------------------

మరోవైపు పున్నమి ఘాట్‌లో రేపు నిర్వహించనున్న డ్రోన్ ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేసున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పున్నమి ఘాట్‌లో నిర్వహించే డ్రోన్ షో నిర్వహణ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఘాట్ పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత ప్రాంతాలలో త్రాగునీటిని, మొబైల్ శౌచాలయాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

-------------------------

మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఏటా నాలుగు చోట్ల అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శనలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలో అఖిలభారత డ్వాక్రా బజార్-2024 సరస్ ముగింపు కార్యక్రమంలో నిన్న మంత్రి మాట్లాడుతూ, పదిరోజుల ప్రదర్శనలో 7.20 కోట్ల రూపాయల ఉత్పత్తుల విక్రయాలు జరగడం హర్షణీయమన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయంఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు.

-------------------------

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేలా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణ పర్యాటక ప్యాకేజీని ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఈ పర్యాటక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ప్రతి శనివారం రాజమహేంద్రవరంలో ఉదయం 6 గంటలకు బయలుదేరే పర్యాటకుల బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్ల కోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాల మీదుగా రాత్రి 7 గంటలకు రాజమహేంద్రవరంలోని హేవలాక్ వంతెన వద్ద ఉన్న పుష్కర్ ఘాట్ కు చేరుకుంటుందని మంత్రి వివరించారు.

-------------------------

దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సంబంధాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కళా ఉత్సవ్-2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విశాఖపట్నం కేంద్రీయ విద్యాలయం ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు నుంచి ఈనెల 23వ తేదీ వరకు మూడురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలలో నృత్యం, గానం, సంగీతం, నాటకం, చిత్ర లేఖనం వంటి పలు విభాగాలలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ లాసెట్– 2024 నమోదు ప్రక్రియను ఈనెల 23వ తేదీ వరకు పొడిగించామని సెట్ కన్వీనర్ ఆచార్య బి. సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వెబ్ ఐచ్ఛికాల  గడువును ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు పొడిగించామని, ఐచ్ఛికాలలో మార్పులకు 29వ తేదీ వరకు అవకాశం కల్పించామని చెప్పారు. నవంబరు 2వ తేదీన ప్రవేశాలను ప్రకటిస్తామని తెలిపారు.

=======================